# సాక్షి అనంతపురం

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024





## మున్సిపల్ స్థలం కబ్జా

గుత్తిలో 17 సెంట్ల మున్సిపల్ స్థలాన్ని టీడీపీ నేత కృష్ణ కబ్జా చేశాడు. అధికారుల నోటీసులను బేఖాతరు చేస్తున్నాడు.

8లో



## టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.7°/ 16.7°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

## న్యూస్‌రీల్

### ఎన్నికల్లో సమష్టిగా పనిచేద్దాం




మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం:** సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ అధికారులందరూ సమష్టిగా పనిచేద్దామని ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఇతర ప్రభుత్వ విభాగాధిపతులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి నుంచే ఆయా విభాగాలకు నిర్దేశించిన మేరకు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ జి.రామకృష్ణ, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మురళీధర్, ఆదాయ పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి, సెంట్రల్ ఎక్సైజ్, స్టేట్ ఎక్సైజ్ కమిషనర్లు అనిత, సోనియా తార, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, సైబర్ విభాగం సీఐ షేక్ జాకీర్ పాల్గొన్నారు.

### ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



ఆత్మకూరు కేజీబీవీలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న దృశ్యం

**అనంతపురం మెడికల్:** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం శుక్రవారం జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగులు నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పకడ్బందీగా చేపట్టారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఆరోగ్య సిబ్బంది వెళ్లి పిల్లల చేత మాత్రలు మింగించారు. మొత్తం 5,64,324 మంది పిల్లలకు గాను 5,53,143 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి తెలిపారు. పిల్లలు ఆడుకుని చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం ద్వారా కడుపులోకి నులిపురుగులు ప్రవేశిస్తాయన్నారు. రక్తహీనత ఏర్పడి పిల్లల ఎదుగుదలకు అవరోధం ఏర్పడుతుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు మింగితే నులిపురుగులు నశించి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు.

### ఎంటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో జనవరిలో జరిగిన ఎంటెక్ మూడో సెమిస్టర్ (ఆర్–21) మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం విడుదల చేశారు. పరీక్షలు ముగిసిన 9 రోజుల్లోనే ఎంటెక్ ఫలితాల విడుదలకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.మమత, అజిత, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ కేఎఫ్ భారతి పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధికి హామీ



ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు (ఫైల్)

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు సీజన్‌లో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటారు. మిగతా సమయంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు అవసరమైనన్ని పనులు కల్పించేందుకు జగన్ సర్కారు చర్యలు చేపట్టింది. జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ సొంతూరిలోనే పని కల్పించి ఆదుకుంటోంది.

- కూలీల సంక్షేమానికి జగన్ సర్కారు పెద్దపీట
- 2023–24లో 99.49 లక్షల పనిదినాలు పూర్తి
- కూలీల ఖాతాలకు రూ.238.12 కోట్ల జమ
- 2024–25లో 1.41 కోట్ల పని దినాలు లక్ష్యం

**రాయదుర్గం:** కూలీలు వలస వెళ్లకుండా ఊరిలోనే పనులు కల్పించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోంది. పథకం లాంఛనంగా ప్రారంభమైన అనంతపురం జిల్లాలోనూ ఈ పథకం కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24 ప్రణాళికలో 1.02 కోట్ల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 97 శాతం అనగా 99.49 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. ఇందులో 1.93 లక్షల కుటుంబాల్లోని 3.30 లక్షల కూలీలకు వేతనాల కింద రూ.238.12 కోట్లు జమ చేశారు. అలాగే అమృత్ సరోవర్, ఫారంపాండ్లు, డగ్గౌట్, ట్రెంచ్‌లు, పర్కులేషన్ ట్యాంక్ ఇతర నీటి సంరక్షణ పనుల కోసం రూ.374.56 కోట్లు కేటాయించి భూగర్భ జలాల అభివృద్ధికి కృషి చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఉపాధి ప్రణాళికలో రైతులు, కూలీల సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఈ మేరకు గ్రామసభల్లో ఉపాధి క్షేత్ర సహాయకులు పనులు గుర్తించారు. గత ఏడాది కంటే 39 లక్షల పనిదినాలు అదనంగా పెంచారు.

**కొత్త పనులకు ఆమోదం**

జిల్లాలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు 2.61 లక్షలు ఉన్నాయి. ఇందులో 5.74 లక్షల మంది యాక్టివ్ కూలీలు ఉన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 1.41 కోట్ల పనిదినాలకు ఆమోదం లభించింది. ఇందులో కూలీల వేతనాల కోసం రూ.254.12 కోట్లు కేటాయించారు. రోజు కూలి రూ.272 కాగా, ఇతర వేసవి అలవెన్సులు, నీటి రవాణా కోసం మరింత జమచేసి ఇవ్వనున్నారు. అయితే కూలీలు సగటు వేతనంగా రోజుకు రూ.250 దాకా పొందుతున్నారు.

**పండ్లతోటల పెంపకానికి పెద్దపీట**

ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 4,490 ఎకరాల్లో 1,556 మంది రైతులు మామిడి, సపోట, బత్తాయి, దానిమ్మ, జామ లాంటి పండ్ల తోటల పెంచుకునేందుకు ప్రోత్సాహం అందిస్తోంది. తద్వారా రైతులకు కావాల్సిన రాయితీలు అందిస్తూ సాగు విస్తరించేలా కృషి చేస్తోంది.

**ఏప్రిల్ నుంచి పనులు..**

ఏప్రిల్ 1 నుంచి కొత్త పనిదినాలు అమల్లోకి వస్తాయి. ఇప్పటికే వంద రోజులు పూర్తయిన కూలీలు తిరిగి పనుల్లో భాగస్వామ్యం కానున్నారు. కూలీలు చేపట్టాల్సిన పనులు ఇప్పటికే గ్రామసభల ద్వారా ఆమోదం పొందాయి. అడిగిన వారందరికీ ఊళ్లోనే ఉపాధి కల్పించేలా ప్రణాళికలు తయారు చేశారు. అయితే ఎన్ఐసీ సర్వర్ అమల్లోకి రావడంతో ఉపాధి పథకంలోనూ సమూల మార్పులు వచ్చాయి. శ్రమించే కూలీలకే ప్రాధాన్యం దక్కనుంది. తూతూమంత్రంగా పనులు చేస్తూ మమ అనిపించే వారికి సగటు వేతనం జమకావడం కష్టం. కూలి చెల్లింపు, మెటీరియల్ కాంపోనెంట్ నిధులను 60:40 నిష్పత్తిగా లెక్కిస్తారు. దీంతో కూలీలకు వేతనరూపేణా ఎంత ఎక్కువ జమైతే అంత మొత్తంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదలవుతాయి. ఉదాహరణకు ఒక కూలీ రోజుకు రూ.100 మాత్రమే సంపాదిస్తే అతడికి అందాల్సిన మరో రూ.140 రద్దవుతుంది. ఇందుకు సంబంధించి 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు కూడా విడుదల కావు. దీంతో జిల్లా అధికారులు ఈసారి యాక్టివ్ కూలీలకు మాత్రమే పనుల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

**పనిదినాలు పూర్తి చేశాం**



ఉన్న ఊళ్లోనే ఉపాధి లభిస్తోంది. భర్తతో కలసి ఈ ఏడాది వంద రోజులు పనులు పూర్తి చేశాం. వారానికి నేను, నా భర్త కలసి రూ.2,800 నుండి రూ.3 వేల వరకు సంపాదిస్తున్నాం. నెలకు రూ.12 వేల వరకు జమయ్యేది. మాలాంటి పేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది

– రాధమ్మ, ఉపాధి మేట్, గోనబావి, గుమ్మఘట్ట మండలం

**ఇంటిల్లిపాదికీ 'ఉపాధి'**



ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి. భార్యతో పాటు ముగ్గురు కుమారులు, ముగ్గురు కోడళ్లు ఈ పనులను సద్వినియోగం చేసుకుంటున్నాం. ఏడాదిలో వంద రోజులూ పనులకెళ్తున్నాం. ప్రభుత్వం సకాలంలో వేతనాలు కూడా జమచేస్తోంది. ఊళ్లోనే కావాల్సినన్ని పనులు కల్పిస్తున్నారు.

– కమ్మరి హనుమంతు, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

**కూలీలందరికీ పనులు**



అడిగిన ప్రతికూలీకి ఉన్న ఊళ్లోనే ఉపాధి కల్పించాం. కరోనా లాంటి కష్టకాలంలోనూ పనులు కల్పించాం. 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రణాళికలోనూ గత ఏడాదికంటే 39 లక్షల పనిదినాలు అదనంగా పెంచాం. రోజు కూలి సగటున రూ.240 అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పనుల గుర్తింపు కూడా పూర్తయింది. ఏప్రిల్ 1 నుంచి విస్తారంగా పనులు కల్పిస్తాం.

– వేణుగోపాలరెడ్డి, డ్వామా పీడీ

## యాడికిలో దారుణం

- భార్య, కుమార్తెను హత్య చేసిన ఉన్మాది




చంద్రావతి, చిన్నారి చైత్రిక మృతదేహాలు



రామకృష్ణ (ఫైల్)

**యాడికి:** మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. రామకృష్ణ అనే వ్యక్తి భార్య చంద్రావతి (28), కుమార్తె చైత్రిక(1)ను దారుణంగా హత్య చేశాడు. గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. కుటుంబ కలహాల వల్లే ఈ దారుణం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. యాడికి మండల కేంద్రానికి చెందిన సురేంద్ర, నంజమ్మ కుమార్తె చంద్రావతిని 2018 సంవత్సరంలో పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన నారాయణ స్వామి ,లక్ష్మీదేవిల మూడో కుమారుడు రామకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు శాన్విత, చైత్రిక(1) సంతానం. మూడేళ్ల క్రితం రామకృష్ణ తన కుటుంబాన్ని యాడికి మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కాలనీకి మార్చారు. అద్దె ఇంట్లో ఉంటూ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అన్యోన్యంగా సాగుతున్న వీరి కుటుంబంలో కొంత కాలం క్రితం భార్యా భర్త మధ్య కలహాలు రేగాయి. ఇవి పెరిగి పెద్దవయ్యాయి. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం రామకృష్ణ భార్యను మంచానికి కట్టేసి దిండును ముఖంపై ఉంచి బలంగా నొక్కి చంపాడు. ఏడాది వయసున్న చైత్రికపై ఐదు కేజీల బియ్యం సంచి వేసి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. తర్వాత సెల్‌ఫోన్ అక్కడే ఉంచి సిమ్ మాత్రం తీసుకుని పారిపోయాడు. శుక్రవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగూ పొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ నాగార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లీబిడ్డ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రావతి తండ్రి సురేంద్ర ఫిర్యాదు మేరకు రామకృష్ణపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

# పాలసేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

- రాచానపల్లి, కొర్రపాడులో పర్యటించిన కలెక్టర్



రాచానపల్లి వద్ద జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

**రాప్తాడు రూరల్/బుక్కరాయసముద్రం:** 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమం కింద పాల సేకరణను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి, బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్దనున్న జగనన్న పాలవెల్లువ, మహిళా డెయిరీ సహకార సంఘాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామాల్లో పాల సేకరణకు అనుకూలంగా ఉందా? లేదా? పాలు పట్టే కేంద్రాలు ఏర్పాటు చేశారా? లేదా? సెక్రటరీ గుర్తింపు, ఎక్విప్‌మెంట్ ఏర్పాటు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయా తదితర వివరాలను ఆరా తీశారు. ఈ నెల 13, 14 తేదీల్లో జగనన్న పాలవెల్లువ కింద పాలసేకరణ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఈ నెల 13వ తేదీలోపు కేటాయించిన పనులు పూర్తి చేయాలన్నారు. పాల సేకరణకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఎంపీడీఓ, వెటర్నరీ డాక్టర్, రూట్ ఇన్‌చార్జ్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు పాల ఉత్పత్తిదారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. 'అమూల్'కు పాలు పోయడం ద్వారా లీటర్‌కు రూ.5 అదనంగా వచ్చే అవకాశం ఉంటుందనే విషయాన్ని వివరించాలన్నారు. బీఎంసీయూకు మూడు రోజుల్లోపు విద్యుత్ సరఫరా అందించాలన్నారు. పాల రవాణాకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పాల సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జేసీ కేతన్‌గార్గ్, జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, ఆర్డీఓ వెంకటేష్, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డెయిరీ మేనేజర్ నారాయణమ్మ, పీఆర్ ఎస్ఈ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రాచానపల్లి సర్పంచ్ బండా అంజియాదవ్, కొర్రపాడు ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ గౌస్, పంచాయతి సెక్రటరీ రామకృష్ణ, బోడిగానిదొడ్డి ఉప సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

**13 నుంచి పాల సేకరణ**

**ఆత్మకూరు:** రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం 'జగనన్న పాల వెల్లువ'కు శ్రీకారం చుట్టిందని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆత్మకూరు మండలంలో ఎంపిక చేసిన 14 గ్రామాల్లో ఈ నెల 13 నుంచి జగనన్న పాల సేకరణ కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆత్మకూరులోని వైకేపీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వెటర్నరీ అధికారులు,, గ్రామ సమైక్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జగనన్న పాలసేకరణ కేంద్రాలకు మరో రెండు రోజుల్లో మెటీరియల్ సరఫరా అవుతుందన్నారు. ఒక్కో సచివాలయానికి ఒక్కో సొసైటీ ఉంటుందని, ఇందులో పూర్తిగా మహిళలే సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. పాలకు గిట్టుబాటు ధర సమాచారాన్ని పాడి రైతుల మొబైల్‌కు పంపుతామన్నారు. 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు పాల బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. గ్రామాల్లోని మహిళా రైతులు అధిక సంఖ్యలో పాలు పోసి లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, పశుసంవర్ధక శాఖ అధికారులు తులసీరామ్, దిలీప్, తేజస్విని, ఏపీఎమ్ మదన్‌మోహన్, సచివాలయ సిబ్బంది, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

# శుభముహూర్తాల మాఘం



**అనంతపురం కల్చరల్:** శుభముహూర్తాల మాసం మాఘం రానే వచ్చింది. శుక్రవారం అమావాస్యతో పుష్యమాసం ముగిసి శనివారం నుంచి మాఘం ప్రారంభం కానుంది. పరిణయ ముహూర్తాలను వెంటబెట్టుకొస్తున్న ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా వందలాది జంటలు ఏకం కానున్నాయి. ఇంటింటా బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలు మార్మోగనున్నాయి. పెళ్లిళ్లే కాకుండా గృహప్రవేశాలు, నామకరణోత్సవాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు కూడా మాఘంలో ఎక్కువగా జరుగుతాయి. అయితే రెండు నెలల తర్వాత పవిత్ర శ్రావణమాసం సహా మళ్లీ ఆరు నెలల పాటు శుభ ముహూర్తాలు లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల బుకింగ్‌లతో కళకళలాడుతున్నాయి.

**పండుగలు కూడా అధికమే**

ఈ నెల 10 నుంచి మార్చి 9 వరకు ఉండే మాఘ మాసంలో శుభముహూర్తాలతో పాటు పండుగలు కూడా అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా మాఘ స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందే స్నానమాచరిస్తే విశేష పుణ్యఫలమని అందరూ భావిస్తారు. ఈ మాసంలో జాతర్లు, తిరునాళ్లు వస్తాయి. బుక్కరాయసముద్రం కొండమీది రాయుడు తిరునాళ్ల, బొలికొండ రంగనాథుని జాతర, తడకలేరు తేరు వంటివి ఈ నెలలోనే జరుగుతాయి. మాసం చివరి రోజున వచ్చే మహాశివరాత్రి మాఘమాసానికే ఆధ్యాత్మిక శోభ తెస్తుంది. అలాగే 14న రానున్న వసంత పంచమి అక్షరాభ్యాసాలకు నెలవుగా ఉంటుంది. 16వ తేదీన ప్రత్యక్ష భగవానుడైన సూర్యదేవర రథసప్తమి, వాసవీమాత ఆత్మార్పణదినం, బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి, రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతి, మార్కండేయ జయంతి పర్వదినాలు అందరిలోనూ భక్తిభావాన్ని తెస్తాయి.

**విశేష ప్రాముఖ్యత కలిగిన మాసం**



సాధారణంగా హైందవ జీవితంలో ప్రతి మాసానికీ ఒక ప్రత్యేకత ఉన్నట్టే మాఘ మాసానికి విశేష ప్రాముఖ్యత కనపడుతుంది. సూర్యభగవానుడు ఉదయించక మునుపే స్నానమాచరించడం సైన్సు పరంగా కూడా ఎంతో మంచిది. ఈ నెల 11, 14, 18, 28, 29 తేదీల్లో విశేషమైన ముహూర్తాలున్నాయి. అలాగే జాతర్లు, తిరునాళ్లు ఏర్పాటు చేయడం కూడా అందరిలో ఐకమత్యం, మానసిక ప్రశాంతత పెంచడం కోసమే.

– రాఘవేంద్ర ప్రసాద్ శర్మ, పురోహితులు, గీతామందిరం, అనంతపురం

# నేడు యువ న్యాయవాదుల సదస్సు

- సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల రాక



**అనంతపురం:** జేఎన్‌టీయూ (అనంతపురం) ఆడిటోరియంలో శనివారం యువ న్యాయవాదుల సదస్సు నిర్వహిస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఎ.రామిరెడ్డి తెలిపారు. సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ అశానుద్దీన్ అమానుల్లా ముఖ్య అతిథిగా, సుప్రీం కోర్టు జడ్జీలు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి విశిష్ట అతిథులుగా హాజరవుతారన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, హైకోర్టు జడ్జీలు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ బి.శ్యామసుందర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ ఎస్.ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ అపూర్వ కుమార్ శర్మ, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ రామ జోగేశ్వర రావు, అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.విశ్వనాథ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారన్నారు.

- 'సివిల్ ప్రొసీజర్ కోడ్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు డిస్పోజల్ ఆఫ్ ఇంటర్లోక్యూటోరీ అప్లికేషన్స్'అనే అంశంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.
- 'రిలవెన్స్ ఆఫ్ అడ్మిషన్స్ అండ్ కన్ఫెషన్స్ ఇన్ ఏ క్రిమినల్ ట్రయిల్' అనే అంశంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.
- 'అప్లికేషన్ ఆఫ్ ఎవిడెన్స్ ఇన్ క్రిమినల్ లా' అనే అంశంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రజెంటేషన్ ఇస్తారు.
- 'ఇంపార్టెన్స్ ఆఫ్ ఎథిక్స్ ఇన్ లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశానుద్దీన్ అమానుల్లా ప్రసంగిస్తారు.
- 'ఎఫెక్టివ్ కోర్టు రూమ్ అడ్వొకసీ' అనే అంశంపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రసంగిస్తారు.
- 'రూల్ ఆఫ్ లా అండ్ రోల్ ఆఫ్ అడ్వకేట్స్ ఇన్ బిల్డింగ్ ప్రాస్పెరస్ భారత్' అంశంపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ప్రసంగిస్తారు.

# పెరిగిన పరపతి..!

- వేరుశనగకు ఎకరాకు రూ.38 వేల పంట రుణం
- బ్యాంకర్లకున్న వెసులుబాటుతో 15 శాతం అదనంగా లబ్ధి
- వరికి రూ.43 వేలు, పత్తికి రూ.42 వేలు, కందికి రూ.20 వేలు
- ఉద్యాన, మల్బరీ పంటలకు పెరిగిన గరిష్ట రుణ పరిమితి
- స్టేట్ కమిటీకి పంటల వారీగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రతిపాదనలు



**అనంతపురం అగ్రికల్చర్:** పంట పెట్టుబడుల కోసం బ్యాంకుల ద్వారా రైతులు తీసుకునే రుణాల పరిమితి పెరగనుంది. వచ్చే ఆర్థిక (2024–25) సంవత్సరం నుంచి ఇది అమలు కానుంది. ఈ మేరకు జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) పంటల వారీగా గరిష్ట రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ప్రతిపాదనలను తయారు చేసి రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి పంపింది. ఖరీఫ్–2024లో బ్యాంకుల ద్వారా పాత రుణాల రెన్యూవల్స్, కొత్తగా పంట రుణాలు పొందనున్న రైతులకు కొత్త రుణపరిమితి వర్తింపజేయనున్నారు. జిల్లాలో ప్రధానపంట వేరుశనగకు ఎకరాకు రూ.32 వేల నుంచి రూ.38 వేలకు పెంచి రుణం ఇవ్వాలని ప్రతిపాదించారు. మెజార్టీ రైతులు వేరుశనగ పంట మీద రుణం తీసుకోనున్న నేపథ్యంలో బ్యాంకర్లకు 15 శాతం మేర ఉన్న వెసులుబాటుతో ఎకరాకు రూ.40 వేలకు పైగా పంట రుణాలు పొందే అవకాశం ఉందని చెబుతున్నారు.

**రైతుకు వెసులుబాటు కల్పించేందుకే...**

వేరుశనగతో పాటు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలు, కూరగాయలు, ఔషధాలు, పూలసాగు, మల్బరి, నర్సరీలు, పాడి, జీవాల పెంపకం తదితర అన్నింటికీ బ్యాంకుల ద్వారా గరిష్ఠ రుణపరిమితిని పెంచుతూ ప్రతిపాదించారు. రెండు రోజుల కిందట కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్, సీఈఓ ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ఎల్‌డీఎం, నాబార్డు డీడీఎం, ప్రధాన బ్యాంకుల ఆర్ఎంలు డీఎల్‌టీసీ సమావేశంలో పాల్గొన్నారు. పంటల వారీగా రైతులు పెడుతున్న ఖర్చులు, వస్తున్న దిగుబడులు, నికర ఆదాయం తదితర అంశాలపై చర్చించి రైతుకు ఏ మేరకు రుణం ఇస్తే వెసులుబాటు కలుగుతుందనే దానిపై ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర కమిటీకి పంపారు.

- గతేడాదితో పోల్చితే ఈసారి కొన్నింటికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ బాగా పెంచారు. మరికొన్నింటికి గతంలో మాదిరిగానే ప్రతిపాదించారు. ఏప్రిల్ చివరి వారం నుంచి బ్యాంకర్లు పంట రుణాల రెన్యూవల్స్‌ను మొదలు పెట్టనున్నారు. జూన్ నుంచి ఆగస్టు మధ్య జోరుగా రెన్యువల్స్, కొత్త రుణాల పంపిణీ ఉంటుందని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి. గతేడాది అంటే ఖరీఫ్–2023లో రూ.6,014 కోట్లు మేర పంట రుణాలు రెన్యువల్స్, కొత్త రుణాలు పంపిణీ చేశారు. ఈ సారి అంతకు మించి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**2024-25లో ప్రధానపంటల గరిష్ట రుణపరిమితి ప్రతిపాదనలు**

| పంట | గరిష్ట రుణపరిమితి ఎకరాకు (రూ.) |
|---|---|
| వేరుశనగ | రూ.38 వేలు |
| వరి | రూ.43 వేలు |
| జొన్న | రూ.25 వేలు |
| మొక్కజొన్న | రూ.33 వేలు |
| కంది | రూ.20 వేలు |
| పప్పుశనగ | రూ.34 వేలు |
| పత్తి | రూ.42 వేలు |
| పచ్చిమిరప | రూ.76 వేలు |
| ఎండుమిరప | రూ.లక్ష |
| మల్బరి | రూ.1.05 లక్షలు |
| టమాట | రూ.90 వేలు |
| ఉల్లి | రూ.44 వేలు |
| కరివేపాకు | రూ.47 వేలు |
| అరటి | రూ.1.20 లక్షలు |
| చీనీ, నిమ్మ | రూ.63 వేలు |
| దానిమ్మ | రూ.97 వేలు |
| కళింగర, కర్బూజ | రూ.55 వేలు |
| ద్రాక్ష | రూ.లక్ష |
| మామిడి | రూ.38 వేలు |
| ఫిష్ కల్చర్ | రూ.1.05 లక్షలు |

## క్లుప్తంగా

### అలజడి చిత్ర షూటింగ్ ప్రారంభం


క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం


**గుంతకల్లు:** శృతి క్రియేషన్స్ ఆధ్వర్యంలో చిన్న ఓబులేసు, రాధమ్మ నిర్మిస్తున్న అలజడి సినిమా షూటింగ్ గుంతకల్లులో శుక్రవారం ప్రారంభమైంది. పాత గుత్తి రోడ్డులోని ఎఫ్‌సీఐ గోదాము సమీపంలోని క్రీస్తు సంఘం చర్చిలో తొలి సన్నివేశం చిత్రీకరించారు. తొలుత బిషప్ సురేష్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్ ఎంసీ కుమార్ క్లాప్ కొట్టగా జేఎస్ రాజు కెమెరా ఆన్ చేసి షూటింగ్‌ను ప్రారంభించారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా సినిమాను సీనియర్ డైరెక్టర్ సురేష్ మంచాల సహకారంతో చిత్రీకరిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్లు నాని, వినయ్ తెలిపారు. డానీ లారెన్స్ ఛాయాగ్రాహకుడిగా పనిచేస్తున్న ఈ చిత్రంలో కేవీ నటబ్రహ్మ, నాగరాజు, సురేష్, శ్రీనివాసులు, పీరా తదితరులు నటిస్తున్నారు. కార్యక్రమంలో అఖిల భారత యువత చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

### 27న డాక్ అదాలత్

**అనంతపురం సిటీ:** కర్నూలు రీజియన్ పరిధిలో తపాలా శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ అనంతపురం డివిజన్ పీఆర్‌ఓ పాటిల్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్నూలు రీజియన్ పరిధిలో తపాలా శాఖ పరంగా ఎలాంటి సమస్యలున్నా రాతపూర్వకంగా 'అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, కర్నూలు–518002 చిరునామాకు చేరేలా ఫిర్యాదు పంపాలి. కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలి.

# దివ్య క్షేత్రం.. కోటంక

కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం



- భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
- రేపటి నుంచి కోటంకలో గుంటికింద సుబ్బరాయుడి తిరునాల
- 24న రథోత్సవం

**గార్లదిన్నె:** భక్తుల కోర్కెలు తీర్చేందుకు సుబ్రహ్మణ్య స్వామి వివిధ ప్రాంతాల్లో అవతరించారు. అలాంటి వాటిలో ప్రముఖ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం. ఇక్కడ స్వామి స్వయంభూగా వెలిసినట్లు పురాణ ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది. తూర్పు ముఖంగా నాగేంద్రుని ఆకారంలో ఉన్న పెద్ద శిల (గుండు)ను భక్తులు షణ్ముఖీ స్వరూపంగా కొలుస్తారు. దీంతో గుండుకింద సుబ్బరాయుడిగా భక్తులు పిలుస్తుంటారు. కాలక్రమంలో ఇది కాస్త గుంటికింద సుబ్బరాయుడిగా రూపాంతరం చెంది భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఇక్కడి గొప్పతనం తెలిసిన ఎందరో రుషులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ తపస్సు చేశారని ఆలయ చరిత్ర చెబుతోంది.

**ఈ నెల 11 నుంచి బ్రహ్మోత్సవాలు**

అనంతపురం నగరానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రంలో ఈ నెల 11 నుంచి మార్చి 10వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఏటా మాఘమాసంలో స్వామి బ్రహ్మోత్సవాలు నాలుగు వారాల పాటు వైభవంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఆదివారం బ్రహ్మోత్సవాల అంకురార్పణకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ తిరునాలకు జిల్లా నలమూలల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. దీంతో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు.


స్వామి మూలవిరాట్

**ఉత్సవాలు ఇలా...**

- ఈ నెల 11న మాఘమాసం మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చనలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు.
- 18న రెండో ఆదివారం శ్రీవారికి ఏకవార రుద్రాభిషేకం ఉంటుంది.
- 24న శనివారం రాత్రి 8 నుంచి ఆదివారం వేకువజాము 2 గంటల వరకూ రథోత్సవం నిర్వహిస్తారు.
- 25న మూడో ఆదివారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవం, తిరునాల ఉంటుంది.
- మార్చి 2న శ్రీవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- 3న నాల్గో ఆదివారం శ్రీవారికి రుద్రాభిషేకం ఉంటుంది.
- 8న విశేష పూజలు, అర్చనలు ఉంటాయి.
- 10న ఐదో ఆదివారం రుద్రాభిషేకం, సహస్రనామార్చన ఉంటాయి.

### సకల కోరికలూ సిద్ధిస్తాయి



కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాలను ఏటా మాఘమాసంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మాసంలోని నాలుగు ఆదివారాలూ ఆలయంలో విశేష పూజలు ఉంటాయి. 24న రథోత్సవం, 25న కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని 9, 11, 16 ఆదివారాలు చొప్పున క్రమం తప్పకుండా దర్శించుకుంటే సకల కోరికలు సిద్ధిస్తాయి.

– రామాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు

### ఏర్పాట్లు పూర్తి చేశాం



కోటంకలోని గుంటికింద సుబ్రహ్మణ్యస్వామి తిరునాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి వారం అన్నదానం ఉంటుంది. తిరునాల రోజు అనంతపురం నుంచి ఆలయం వరకూ ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు.

– బాబు, ఆలయ ఈఓ


గుంటి కింద ఉన్న కొలను


108 సాలగ్రామ శివలింగాలు

### విద్యార్థిని అనుమానాస్పద మృతి


వైష్ణవి మృతదేహం

**యల్లనూరు:** మండలంలోని పెద్దమల్లేపల్లికి చెందిన కె.రామాంజులరెడ్డి కుమార్తె వైష్ణవి (18) అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. రామాంజులరెడ్డికి ముగ్గురు సంతానం కాగా, రెండో కుమార్తె వైష్ణవి నంద్యాలలోని ఓ కళాశాలలో డిప్లొమా రెండో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో తన ప్రేమ వ్యవహారం తెలుసుకున్న తండ్రి మందలించాడు. ఆ సమయంలో వైష్ణవి ససేమిరా అనడంతో అసహనానికి గురైన ఆయన ఆమె చెంపపై కొట్టాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న వైష్ణవిని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఘటనపై తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు.

### మహిళ దృష్టి ఏమార్చి గొలుసు అపహరణ

**రాప్తాడు రూరల్:** మహిళ దృష్టి ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన అనంతపురం రూరల్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కురుగుంట గ్రామానికి చెందిన రవిశంకర్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ దంపతులు గేదెలు పెట్టుకుని పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తమకున్న గేదెలను శుక్రవారం ఉదయం జగనన్న కాలనీ వైపు మేపునకు లక్ష్మీనరసమ్మ తోలుకెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఓ యువకుడు తారసపడి ఆమెతో మాట కలిపాడు. ఈ ప్రాంతంలో పేకాట ఆడేవాళ్లు ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం ఉందని ఎక్కడైనా పేకాట ఆడుతుంటే తెలపాలంటూ అడిగాడు. తనకు తెలీదని ఆమె సమాధానం ఇస్తుండగానే ఒక్కసారిగా లక్ష్మీనరసమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్ లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న కొందరు అక్కడికి చేరుకుని గాలించినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### కళ్లలో కారం కొట్టి...

**కళ్యాణదుర్గం రూరల్:** కళ్లలో కారం కొట్టి నగదు అపహరించుకెళ్లిన ఘటనలో కళ్యాణదుర్గం పట్టణంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గానికి చెందిన గోనె సంచుల వ్యాపారి ముస్తాఫా శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనిపై కుందుర్పి రోడ్డు సమీపంలోని కట్టెల డిపో వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు ముస్తాఫా కళ్లలో కారం చల్లి, అతని వద్ద ఉన్న రూ.26 వేలను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### రైలు ఢీకొని దివ్యాంగుడి మృతి

**కదిరి టౌన్:** ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న ఘటనలో ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (53)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. పుట్టుకతోనే చెవుడు, మూగ బాధపడుతున్న వెంకటేష్ వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పొలం పని ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఆయన.. తిరుపతి నుంచి అకోలాకు వెళుతున్న రైలును గమనించకుండా పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టాలు దాటుతున్న సమయంలో వెనుక కొద్ది దూరంలో వస్తున్న భార్య వెంకటేష్‌ను అప్రమత్తం చేసేందుకు కేకలు వేసింది. అయితే చెవుడు కారణంగా ఆయన వినిపించుకోలేదు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబసభ్యులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్‌ఐ రహీం తెలిపారు.

## వైఎస్సార్‌సీపీతోనే గిరిజనుల అభ్యున్నతి


మాట్లాడుతున్న వడిత్యా శంకర్‌నాయక్

**శింగనమల:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని, అన్ని రంగాల్లో గిరిజనులు అభివృద్ధి చెందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో గిరిజనులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి, గిరిజనులకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించారన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించడం, ఆర్థికంగా బలోపేతం చేయడం, చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి వాటిని కమిషన్ పర్యవేక్షిస్తుందన్నారు. అనంతరం పలు సమస్యలపై వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, మార్కెట్ యార్డ్ వైస్ చైర్‌పర్సన్ మూడ్ గీత, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, తహసీల్దార్ శోభన్ బాబు, ఎంపీడీఓ రమణ, సర్పంచ్ వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ నాయక్, బద్యానాయక్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**విడపనకల్లు:** మండలంలోని హావళిగి గ్రామంలో చోటు చేసుకున్న యువకుడి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్ 16న హావళిగి గ్రామానికి చెందిన భూమా రామాంజినేయులు కుమారుడు భూమా హనుమంతు మృతి చెందాడు. అయితే ఈ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. హనుమంతు భార్య దుర్గమ్మతో అదే గ్రామానికి చెందిన ఎదురింటి రామన్న వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఈ విషయం తెలుసుకున్న హనుమంతు పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు భార్యను హెచ్చరించాడు. దీంతో తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైన వదిలించుకోవాలని దుర్గమ్మ భావించింది. ఈ క్రమంలో 2023, డిసెంబర్ 16న పొలం వద్దకెళ్లిన హనుమంతును ప్రియుడితో కలిసి నాగయ్యకు చెందిన జొన్న చేనులోకి బలవంతంగా లాక్కెళ్లి గొంతుపై షర్టుతో బిగించి పురుగుల మందు తాగించారు. విషం ప్రభావం కారణంగా హనుమంతు మృతి చెందాడు. దీంతో హనుమంతు ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించే ప్రయత్నం చేశారు. కేసు దర్యాప్తులో పక్కా ఆధారాలు లభ్యం కావడంతో దుర్గమ్మతో పాటు రామన్ననూ పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం అంగీకరించారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

### సూపరింటెండెంట్ల నియామకం

**అనంతపురం అర్బన్:** కలెక్టరేట్‌లోని రెండు విభాగాలకు సూపరింటెండెంట్లను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.గౌతమి ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతలు – మెజిస్ట్రీయల్ (బి–సెక్షన్) విభాగం సూపరింటెండెంట్‌గా తహసీల్దారు శేషారామ్‌సింగ్, కో–ఆర్డినేషన్ (డీ, హెచ్–సెక్షన్లు) విభాగానికి సూపరింటెండెంట్‌గా తహసీల్దారు రవికుమార్ నియమితులయ్యారు. పరిపాలనా– బడ్జెట్ (ఎ, బి– సెక్షన్లు) విభాగం, భూపరిపాలన (ఈ, జీ – సెక్షన్లు), కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌ఆర్‌సీ) విభాగానికి సూపరింటెండెంట్లను నియమించాల్సి ఉంది. బదిలీపై వచ్చిన తహసీల్దార్లను ఈ స్థానాల్లో నియమించనున్నట్లు సమాచారం.

## నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయాలి

- ఏడీఏ, ఏఓలను ఆదేశించిన డీఏఓ


ఏడీఏ, ఏఓలతో సమావేశమైన డీఏఓ ఉమామహేశ్వరమ్మ

**అనంతపురం అగ్రికల్చర్:** ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెల 15వ తేదీ లోపు వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో ఏడీఏ ఎం.రవితో కలసి ఏఓలతో ఆమె సమావేశమై మాట్లాడారు. రబీ పంటల సాగు ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ మూడు రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల శాంపిల్స్ నాణ్యత పరీక్ష పూర్తి చేయాలన్నారు. పొలంబడి, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం, సీహెచ్‌సీ, పంటల స్థితిగతులు ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలు, మద్దతు ధరతో కందులు, రాగులు కొనుగోలు పరిస్థితి, ఆర్బీకేల పనితీరు, అందుబాటులో ఉన్న ఎరువులు తదితర అంశాలపై ఏఓలకు దిశా నిర్దేశం చేశారు. రానున్న 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆర్బీకే వేదికగా పంటల ప్రణాళిక, బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అనంతపురం, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, కూడేరు, ఆత్మకూరు ఏఓలు సాయిలక్ష్మి, శేఖర్‌రెడ్డి, శ్యామసుందర్‌రెడ్డి, సోమశేఖర్, విజయ్ కుమార్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ స్థలం కబ్జా

- అక్రమంగా ఇల్లు నిర్మించుకున్న టీడీపీ నేత

**గుత్తి:** మున్సిపల్ స్థలాన్ని తెలుగుదేశం పార్టీకి చెందిన టౌన్‌బ్యాంకు డైరెక్టర్ కృష్ణ దర్జాగా కబ్జా చేశాడు. అధికారులు నోటీసులు ఇచ్చినా బేఖాతరు చేస్తున్నాడు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు సర్వే నంబర్–536లో 17 సెంట్ల విలువైన స్థలాన్ని కృష్ణ ఆక్రమించాడు. అంతే కాదు తన కుటుంబ సభ్యులకూ కొంత ధారాదత్తం చేశాడు. దర్జాగా ఇల్లు కూడా నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. స్థలం కబ్జాపై సీనియర్ సిటిజన్, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి మున్సిపల్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు కబ్జాదారుడికి పలు దఫాలుగా నోటీసులు జారీ చేశారు. అయితే వాటిని తీసుకోకుండా అతడు తిప్పి పంపించేశాడు.

**చర్యలు తీసుకుంటాం**

మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించిన కృష్ణపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు 'సాక్షి'కి తెలిపారు. తాము పలుసార్లు నోటీసులు జారీ చేసినా ఆ వ్యక్తి స్పందించలేదన్నారు. రెవెన్యూ అధికారులు కూడా నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదన్నారు. త్వరలోనే అతనిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### తహసీల్దార్ల బదిలీల్లో మార్పు

**అనంతపురం అర్బన్:** ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో తాజాగా కొంత మార్పు చేశారు. కర్నూలు జిల్లా నుంచి తహసీల్దార్లు శ్రీనాథ్, సతీష్, కుమారస్వామిని అనంతపురం జిల్లాకు గతంలో బదిలీ అయ్యారు. చేశారు. అయితే వీరి బదిలీల్లో మార్పు చేస్తూ ఈ ముగ్గురిని తాజాగా అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. దీంతో వీరిని కలెక్టర్ గౌతమి ఇక్కడి నుంచి రిలీవ్ చేశారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయాల్లో పరిపాలనాధికారి స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడి వచ్చిన తహసీల్దార్లలో ముగ్గురిని అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయడంతో మరో మూడు ఖాళీలు ఏర్పాడ్డాయి. దీంతో మొత్తం ఐదుగురు తహసీల్దార్లను జిల్లాకు ప్రభుత్వం కేటాయించాల్సి ఉందని కార్యాలయవర్గాలు తెలిపాయి.

### సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం:** గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేద్దామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం తన చాంబర్‌లో గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్, నాయకులు ధనుంజయ నాయక్, గోపీనాయక్, మహేష్ నాయక్, రమేష్ నాయక్, రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షల గోల్‌మాల్

- రైల్వే డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిధులు స్వాహా
- పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిన డీఆర్ఎం


డీఆర్ఎం కార్యాలయం

**గుంతకల్లు:** స్థానిక రైల్వే డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌లోని ఖాతా నుంచి దాదాపు రూ.20 లక్షలకు పైగా సొమ్ము పక్కదారి పట్టింది. ఈ విషయం అలస్యంగా వెలుగు చూడడంతో ఉన్నత స్థాయి విచారణకు డీఆర్ఎం ఆదేశించారు.

**ఆర్గనైజేషన్‌కు నిధుల సమీకరణ ఇలా..**

డివిజన్ హెడ్‌క్వార్టర్స్ గుంతకల్లు కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ పనిచేస్తోంది. ఈ సంస్థకు డీఆర్ఎం సతీమణి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఇతర ఉన్నతాధికారుల సతీమణిలు కార్యదర్శులు, మెంబర్లుగా ఉంటారు. ఆర్గనైజేషన్ తరఫున పలు సేవా, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆర్గనైజేషన్‌కు రైల్వే పాఠశాల నుంచి వచ్చే ఫీజులతో పాటు వివిధ వర్గాల నుంచి భారీగా విరాళాలు అందుతాయి. అంతేకాక వైట్‌హౌస్ మంటపం, క్యాంటీన్ల నుంచి వచ్చే మొత్తం సొమ్ము, రైల్వేస్టేషన్ రోడ్డులోని కోడిగుడ్ల బ్రిడ్జి సమీపంలో ఖాళీగా ఉన్న రైల్వే స్థలంలో ఏర్పాటు చేసుకున్న పచ్చి టెంకాయల దుకాణదారుల నుంచి అద్దెలు కూడా ఆర్గనైజేషన్ ఖాతాలోనే జమ అవుతాయి. ఆర్గనైజేషన్ కార్యకలాపాలు చూసేందుకు సీనియర్ డీపీఓ కార్యాలయంలో పని చేసే ఓ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ (డబ్ల్యూఐ)తో పాటు, అకౌంట్ వ్యవహారాలు చక్కబెట్టేందుకు మరో కాంట్రాక్ట్ ఉద్యోగిని ఏర్పాటు చేసుకున్నారు.

**డబ్ల్యూఐ కనుసన్నల్లోనే అక్రమాలు**

ఆర్గనైజేషన్ నిధుల వినియోగంపై మూడు నెలల క్రితం ఆడిట్ నిర్వహించారు. ఆ సమయంలో ఖాతాలోని రూ.20 లక్షలకు పైగా సొమ్ముకు సరైన లెక్కలు చూపలేకపోయారు. దీంతో ఈ సొమ్ము కాస్త పక్కదారి పట్టినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. అకౌంట్ వ్యవహారాలు చూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగితో పాటు మరో టీచర్‌ను కలుపుకుని ఖాతాలోని సొమ్మును డబ్ల్యూఐ స్వాహా చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో చెక్‌లపై, ఇతర ముఖ్యమైన డాక్యుమెంట్లపై ముందే సంతకాలు చేయించుకుని డబ్బు కాజేసినట్లుగా విచారణలో బహిర్గతం కావడంతో డబ్ల్యూఐపై ఆర్గనైజేషన్ సభ్యులు మండిపడ్డారు.

**అక్రమాలు జరిగాయి ఇలా...**

గుంతకల్లులోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో ఉన్న ఆర్గనైజేషన్ ఖాతాలో దాదాపు రూ.4లక్షలను ఒక్కసారిగా విత్‌డ్రా చేసి, ఆ ఖాతాను రద్దు చేశారు. తిరిగి అదే బ్యాంకులో మరో కొత్త ఖాతాను సృష్టించి అందులో రూ.50వేలు మాత్రమే జమ చేసి మిగిలిన రూ.3.50 లక్షలను అక్రమార్కులు సొంతానికి వాడుకున్నట్లుగా ఆడిట్ అధికారులు గుర్తించారు. మొత్తం రూ.20 లక్షలకు పైగా సొమ్మును యథేచ్ఛగా సొంతానికి వాడుకున్నట్లుగా బహిర్గతమైంది. ఈ మొత్తం వ్యవహారం డీఆర్ఎం వినీత్‌సింగ్ దృష్టికి వెళ్లడంతో ఈ అంశాన్ని ఆయన చాలా తీవ్రంగా పరిగణిస్తూ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ఆర్గనైజేషన్ విధులతో పాటు రాయచూర్ సెక్షన్ డబ్ల్యూఐగా ఉన్న సదరు వ్యక్తిని ప్రస్తుతం సీనియర్ డీపీఓ కార్యాలయానికి పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### విచారణ కొనసాగుతోంది

ఉమెన్స్ ఆర్గనైజేషన్ నిధుల్లో దాదాపు రూ.13లక్షలు వరకూ తన వ్యక్తిగత అవసరాలకు డబ్ల్యూఐ వాడుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆయనతో పాటు మరో టీచర్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ అంశంపై డీఆర్ఎం వినీత్‌సింగ్ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలోతైన విచారణ కొనసాగుతోంది.

– జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీపీఓ, గుంతకల్లు

## క్లుప్తంగా

### పంటల సాగుపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఏఈఓ సుజిత

**ఆత్మకూరు:** పంటల సాగుకు వాడే మందులపై వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఏఈఓ సుజిత తెలియజేశారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. చాలా మంది రైతులు ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు చెప్పిన మందులు ఉపయోగించి పంటలను కోల్పోతున్నారన్నారు. ఆ షాపుల యజమానులు లాభం పొందుతున్నారన్నారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు మందులు ఉపయోగిస్తే రైతు నష్టపోకుండా పంట దిగుబడితో పాటు లాభాలు వస్తాయని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారని.. ఏ సమస్య వచ్చినా వ్యవసాయ సిబ్బందిని సంప్రదిస్తే సలహా సూచనలు ఇస్తారని తెలిపారు.

### పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ ఎం.రవి

**అనంతపురం అగ్రికల్చర్:** ఆర్బీకే వేదికగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విస్తృత ప్రయోజనాలు కల్పిస్తోందని వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.రవి తెలిపారు. ప్రభుత్వ ఫలాలు రైతులకు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శుక్రవారం స్థానిక రూరల్ వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ చేయించుకుంటే ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ, మద్దతు ధరతో పంటను అమ్ముకోవచ్చన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా ఈ-కేవైసీ పెండింగ్ ఉన్న రైతులు వెంటనే చేయించుకోవాలన్నారు. బ్యాంకు అకౌంట్లు యాక్టివ్‌గా ఉండేలా లింక్ చేయించుకోవాలని సూచించారు. కంది పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఫారంపాండ్లు, మినీ ట్రాక్టర్స్ అవసరమైన రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్ తెలిపారు. సమావేశంలో ఏఈఓలు మురళి, అలేఖ్య, అగ్రిబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య

**అనంతపురం సిటీ:** సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతల్లో వెట్టి చాకిరీ కూడా ఒకటి. ఈ వ్యవస్థ సమూల నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఉమ్మడి జిల్లాకు చెందిన కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీఎల్) జి.లక్ష్మీనరసయ్య తెలిపారు. వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం ఆర్టీఓ కార్యాలయం ఎదుట ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆ శాఖ సహాయ అధికారులు కె.రాధా రమాదేవి, ఎం.సుజాత, కార్యాలయ సిబ్బందితో డిప్యూటీ కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. వెట్టిచాకిరీ కోరల్లో చిక్కుకున్న వారు ఎవరైనా ఉంటే ఆటువంటి వారి వివరాలు తెలపాలని కోరారు. తాము రంగంలోకి దిగి బాధితులను కాపాడుతామని హామీ ఇచ్చారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎవరైనా వెట్టి చాకిరీ చేయించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నిర్బంధ కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం:** నిర్బంధ కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా న్యాయ సేవల సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.దీన అన్నారు. అంతర్జాతీయ నిర్బంధ కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్, రెడ్స్ సంస్థ సంయుక్తంగా శుక్రవారం అనంతపురంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి జి. దీన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్బంధ కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ ప్రసాద రెడ్డి, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానూజ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి, డీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- నడిమివంకకు రక్షణ గోడలు ఏర్పాటు చేయిస్తాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 48వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** రజకనగర్‌లోని నడిమివంక డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 48వ డివిజన్‌లోని రజక్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందించారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని ప్రజలను కోరారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారడీ మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎన్నడూ లేని విధంగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీకే తాము అండగా ఉంటామని, మరోసారి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలోనే నడిమివంక రక్షణ గోడలకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఆ నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వం చెరువుకట్టకు మార్చిందన్నారు. తద్వారా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. వరదలు వచ్చినప్పుడు వర్షపు నీరు సక్రమంగా వెళ్లే రజకనగర్ ఎక్స్‌టెన్షన్‌లో మట్టి దిబ్బలను తొలగించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నడిమివంకకు రక్షణ గోడలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**ప్రత్యేక నిఘా ఉంచాలి**

స్థానికంగా ఉండే కొందరు స్థల విషయమై వంకకు అడ్డుగా మట్టిని వేస్తున్నారని, ఇటువంటి పనులు చేపట్టకుండా నిఘా పెంచాలని త్రీటౌన్ పోలీసులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వంకకు అడ్డుగా ఎవరు ఇసుక వేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు బ్లాక్ అవడం ద్వారా స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతారన్నారు.

### టీడీపీ, జనసేన, బీజేపీకి డిపాజిట్లు దక్కవు

టీడీపీ, జనసేన, బీజేపీలు విడిగా పోటీ చేస్తే ఆ పార్టీలకు డిపాజిట్లు దక్కవని ఎమ్మెల్యే అనంత ధ్వజమెత్తారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబుకు ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే ధైర్యం లేదన్నారు. అందుకే ఢిల్లీకి వెళ్లి పొత్తుల కోసం పాకులాడుతున్నారన్నారు. ఎంత మంది కలసి వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీది ఒంటరి పోరేనన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం అమలు చేసిందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ శ్రీనివాసులు, గురు శేఖర్‌బాబు, అబూసలేహ, దుర్గాదేవి, రహంతుల్లా, ఇసాక్, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, షంషద్దీన్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, శ్రీదేవి, నాయకులు చింతకుంట మధు, రాధాకృష్ణ, దాదు, నిమ్మల నాగరాజు, రామచంద్ర, జావెద్, సుహాసిని, సుజాతరెడ్డి, తలారి వెంకటేష్, ఉష, రాధాయాదవ్, భారతి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు గౌరవగార్డెన్స్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలోని 48వ డివిజన్ గౌరవగార్డెన్స్ ప్రాంతంలో శనివారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లోని శాంతినగర్ బోర్డు నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### ప్రపంచ రికార్డు సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం:** 750 కిలోమీటర్ల స్కేటింగ్ నాన్ స్టాప్ రోడ్ రిలే మారథాన్‌లో పాల్గొంటున్న ఏడుగురు విద్యార్థులకు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 12 నుంచి మూడు రోజుల పాటు తాడిపత్రి, ధర్మవరం, అనంతపురం మీదుగా నాన్ స్టాప్ రోడ్ రిలే మారథాన్ జరగనుంది. శుక్రవారం తాడిపత్రిలోని భగవాన్ రమణ మహర్షి అనాథ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు జిల్లా ఎస్పీని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మారథాన్‌లో విజయం సాధించి ప్రపంచ రికార్డు సాధించాలని ఆకాంక్షించారు.

# నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం ఎడ్యుకేషన్:** చిన్నారులలో నులిపురుగులను నివారించేలా చర్యలు తీసుకుందామని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగర మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని కేఎస్‌ఆర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ భ్రమరాంబదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, కళాశాల సిబ్బంది, సచివాలయం ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** ఆరోగ్య విషయాలపై ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా విద్యార్థినులకు సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 6,021 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్‌ఓ షమీన్‌తార, సీహెచ్‌ఎన్ తులసమ్మ, సీహెచ్‌ఓ ప్రీతి ఏఎన్‌ఎం, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

**రాప్తాడు:** నులిపురుగుల నివారణతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి శివకృష్ణ అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. 1 నుంచి 19 ఏళ్ల బాల, బాలికల్లో నులిపురుగుల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు.

**కనగానపల్లి:** అల్బెండజోల్ మాత్రల ద్వారా నులిపురుగులను నివారించొచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని 53 అంగన్‌వాడీ కేంద్రాలు, 47 పాఠశాలలు, 2 కళాశాలల్లోని 6,233 మంది విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు వేశారు.

# నాణ్యతగా అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్ మేఘ స్వరూప్

**అనంతపురం కార్పొరేషన్:** అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ వై.మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం హమాలీకాలనీ, విద్యుత్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి పనులకు ఫైనల్ క్లియరెన్స్ ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. వర్క్ ఆర్డర్ ప్రకారం పనులు చేశారా అంటూ రోడ్లు, కాలువల కొలతలను పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ నివేదిక తప్పనిసరిగా ఉండాలన్నారు. వర్క్ ఆర్డర్ ప్రకారం పనులు జరిగినట్లు కమిషనర్ నిర్ధారణకు వచ్చారు. పనులు నాణ్యతగా చేపట్టేందుకు పనులు జరిగే సమయంలో ఏఈ/అమినిటీ తప్పక ఉండాలన్నారు. ప్రతి పనికీ క్వాలిటీ కంట్రోల్ నివేదిక తీసుకోవాలన్నారు. పనులు జరిగే సమయంలోనే ఆయా స్టేజ్ల ప్రకారం పనులను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. బిల్లు చెల్లింపుల్లో కూడా జాప్యం లేకుండా వేగంగా రికార్డు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి**

పేదల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 36వ సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్‌లో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి వార్డు కార్యదర్శి నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సుధారాణి, ఏఈ బాబావలి పాల్గొన్నారు.

**సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్**

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 1, 4, 5, 7, 29, 45, 47, 49, 50, 51, 52, 64, 68, 72, 74 సచివాలయాలను సందర్శించారు. కమిషనర్ ఆదేశాలతో శనివారం, ఆదివారం రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు సాక్షికి తెలిపారు. శుక్రవారం వివిధ సచివాలయాల పరిధిలో 300కు పైగా ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు.

# ఎన్నికలకు 'సిద్ధం' అవుదాం



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

**రాప్తాడు:** ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం కావాలని పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రాయలసీమ జిల్లాలు వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల వైఎస్సార్‌సీపీ సన్నాహక 'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఆటో నగర్ సమీపంలోని స్థలాన్ని చదును, టెంట్లు, సభాస్థలి, వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేశారని వివరించారు. పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన కొనసాగిస్తూ ప్రజలను ఆర్థికంగా ఆదుకున్నారని కొనియాడారు. జగన్ మరోసారి సీఎం కావడం లాంఛనమే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కలిసి వచ్చినా, జగన్‌పై ఎన్ని కుట్రలు చేసినా, ఎంత విష ప్రచారం చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి



మోదీకి వ్యతిరేకంగా రెఫరెండం నిర్వహిస్తున్న ఏఐఎస్ఏ జాతీయ కార్యవర్గ సభ్యుడు వేమన

**అనంతపురం:** నూతన జాతీయ విద్యా విధానంతో విద్యా వ్యవస్థ అథోగతి అవుతుందని ఏఐఎస్ఏ జాతీయ కార్యవర్గ సభ్యుడు వేమన అన్నారు. యంగ్ ఇండియా రెఫరెండంను జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఇందులో భాగంగా నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా 4,516 మంది ఎస్కేయూ విద్యార్థులు రెఫరెండంలో స్వచ్ఛందంగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఏడాదికి 2 కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోదీ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ యూనివర్సిటీ కార్యదర్శి రాజు నాయక్, వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, నాయకులు మనోహర్, నరేష్, ఆనంద్, భాను తదితరులు పాల్గొన్నారు.

# అనంతలో పాత పాటల ప్రేమికుల సందడి



వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పాత పాటల ప్రేమికుల సంఘం సభ్యులు

**అనంతపురం కల్చరల్:** ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని వివిధ జిల్లాల నుంచి పాత పాటల ప్రేమికులు శుక్రవారం అనంతకు విచ్చేశారు. మూడు రోజుల పాటూ సాగే కార్యక్రమాల్లో సంఘం అధ్యక్షులు ఓబుళదాసు, ఘంటసాల రామయ్య నేతృత్వంలో తొలిరోజు అనంతలోని పలు దర్శనీయ స్థలాలను సందర్శించుకున్నారు. స్కాన్, హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక భవనం, రాజీవ్ చిల్డ్రన్ పార్కు తదితర చోట్ల ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రామయ్య మాట్లాడుతూ.. శనివారం తాడిపత్రి ఆలూరు కోనలో విహారయాత్ర ఉంటుందని తెలిపారు. ఆదివారం ఘంటసాల మాస్టర్ వర్ధంతి కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతుందని వెల్లడించారు. పాత పాటల ప్రేమికుల ఔత్సాహికుల సమూహం సభ్యుల ఆటపాటలతో పాటూ అమరగాయకుడు ఘంటసాల పాటలతో గాయనీ గాయకులు హోరెత్తిస్తారని తెలిపారు. సాయంత్రం హౌసింగ్ బోర్డులోని స్మారక విగ్రహం వద్ద సాయంత్రం 4:30 నుంచి 8:30 వరకూ జరిగే ఆ పాత మధురాలను అందరూ ఆస్వాదించాలని కోరారు. అనంతరం ఇతర జిల్లాల వారికి అనంత రుచులను పరిచయం చేశారు. కార్యక్రమంలో పాపాప్రే సమూహం సభ్యులు శ్రీనివాసరావు, రామమోహనరెడ్డి, శాంతి, శ్రీమణి, దుర్గాప్రసాద్, సత్యనారాయణమూర్తి, శ్రీదేవి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

**అనంతపురం టవర్‌క్లాక్:** కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న భారతీయ జనతా పార్టీని గద్దె దింపాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కార్మిక రైతు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రైతులు బాగు పడాలంటే వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేటర్లకు అనుకూలంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మె-గ్రామీణ బంద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, బాల రంగయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప యాదవ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ● ఇవేం.. ఎండలు బాబోయ్



నోరూరించే పుచ్చకాయలు అమ్ముతున్న వ్యాపారి



చెట్టు నీడలో సేదదీరుతున్న చిన్నారులు

నగరంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. ఉదయం 10 గంటలు దాటితే భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. సాధారణంగా ఫిబ్రవరి చివరి వారంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలోనే పగటిపూట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. ఓవైపు సూర్య ప్రతాపం.. మరోవైపు ఉక్కపోతతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి పానీయాలు సేవిస్తున్నారు. చెట్ల కింద సేదతీరుతున్నారు. కళింగర, ఆరంజ్, దోస, ఐస్ క్రీమ్స్ విక్రయాలు ఊపందుకున్నాయి. వడగాలుల తీవ్రత ఇప్పుడే ఇలా ఉంటే మార్చి, ఏప్రిల్ నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి మరి.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:



చున్నీలే రక్షణ: చున్నీ కప్పుకుని వెళ్తున్న విద్యార్థిని

### లడ్డూ విక్రయాలకు వేలం

**తాడిపత్రిటౌన్:** పెద్దపప్పూరు మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం మాఘమాసం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లడ్డూ ప్రసాద విక్రయాలకు వేలం నిర్వహించారు. వేలంలో అనంతపురం పట్టణానికి చెందిన లక్ష్మీనరసమ్మ రూ.4.80 లక్షలకు వేలం పాడి లడ్డూ ప్రసాద విక్రయాల హక్కును దక్కించుకున్నారు.



# 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్' పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** అమెరికాకు చెందిన నాసా నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా 12–18 సంవత్సరాల వయస్సు విద్యార్థులకు స్పేస్ సెటిల్మెంట్‌లో అగ్రికల్చర్ మాడ్యూల్ డిజైన్‌పై మొదటిసారిగా నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్' పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం కమ్మభవన్ సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రి బ్రాంచ్ 6వ తరగతి భావేష్, గుంతకల్లు-1 బ్రాంచ్ 9వ తరగతి మల్లేశ్వరి, మెహదియా, యశ్వంత్, శ్రీసుమిత్, 8వ తరగతి శ్రావ్య సత్తా చాటినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల అత్యుత్తమ శిక్షణతో విద్యార్థులు ఘన విజయాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, వీరేష్ బాబు, కో-ఆర్డినేటర్స్ రాధాకృష్ణ నాయుడు, తిరుమలేష్, శ్రీనివాసులు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

**అనంతపురం కల్చరల్:** మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడంపై ఏపీ ఎండోమెంట్ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్, పలు బ్రాహ్మణ సంఘాల నేతలు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెట్టిన పీవీని కేంద్ర ప్రభుత్వం సమున్నతంగా గౌరవించిందన్నారు. దేశానికి ఎనలేని సేవలందించిన తెలుగు వారిని గుర్తించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

### పీవీ రమణయ్యకు ఘంటసాల అవార్డు

**అనంతపురం కల్చరల్:** ఘంటసాల సంగీత కళాభారతి వారి ఆధ్వర్యంలో ఈనెల 11న ఘంటసాల అవార్డు ప్రదానోత్సవం ఉంటుందని సంస్థ అధ్యక్షుడు సురేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అనంతపురం క్లబ్ ప్రాంగణంలో జరిగే సంగీతోత్సవంలో కాకినాడకు చెందిన సీనియర్ గాయకుడు పీవీ రమణకు అనంత కళాకారుల చేతుల మీదుగా అవార్డు అందజేస్తామన్నారు.